సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



భారత్ జోరు.. విశాఖ హుషారు 8లో

సొంతిల్లు.. ఆనందాల హరివిల్లు

- జిల్లాలో 4,080 టిడ్కో ఇళ్లు ప్రారంభం
- రూ.359 కోట్లతో నిర్మించిన ప్రభుత్వం
- ఉచితంగా ఇళ్ల రిజిస్ట్రేషన్
- నిత్యావసర సరకుల కోసం జగనన్న మహిళా మార్ట్‌లు
- రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఏర్పాటు



లబ్ధిదారులకు దుస్తులు అందజేస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్న కుమార్, ఎంపీ ఎంవీవీ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి



ఇళ్ల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో లబ్ధిదారులకు అప్పగించిన టిడ్కో గృహ సముదాయాల వద్ద కోట్లాది రూపాయలతో సకల సౌకర్యాలు కల్పించినట్లు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ చెప్పారు. జిల్లాలోని దబ్బందలో 1,920, బర్మాకాలనీలో 48, అప్పికొండలో 816, నడుపూరులో 960, ములగాడలో 336 చొప్పున నిర్మించిన టిడ్కో ఇళ్లను శనివారం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి దబ్బందలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జమ్మాన ప్రసన్న కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో గృహ నిర్మాణ శాఖ పనులు నిర్లక్ష్యానికి గురికావడంతో.. నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు అందని పరిస్థితి నెలకొందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల పథకాన్ని ప్రారంభించినా.. పూర్తి చేసి లబ్ధిదారులకు అందించలేకపోయిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించడంతో రాష్ట్ర వ్యాప్తంగా 97 వేల ఇళ్లకు మోక్షం కలిగిందన్నారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు కల్పించి.. లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలు ఉండకూడదన్న లక్ష్యంతో ఒకే సారి 31 లక్షల మందికి కాలనీ ఇళ్లు మంజూరు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. నాడు–నేడు పథకం కింద విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి ఆయనే అని కొనియాడారు. కొన్ని పార్టీలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ జిల్లాలో 1.50 లక్షల మందికి సెంటు ఇంటి స్థలం పట్టాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి అందిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో 4,080 టిడ్కో ఇళ్ల నిర్మాణానికి రూ.359 కోట్లు వ్యయమైందని చెప్పారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సౌకర్యార్థం బస్సుతో పాటు, సెల్ టవర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నంత కాలం ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు ఉండవని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంను చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రూ.2.73 కోట్లతో నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ముందుగా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గృహ నిర్మాణ శాఖ పీడీ పాపునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్ బలిరెడి మల్లికార్జునరావు, ఎంపీటీసీ సభ్యురాలు పావాడ గౌతమి, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, మండల అధ్యక్షుడు బంక సత్యం, నాయకులు డోల దేవుడు, బీఆర్‌బీ నాయుడు, బలిరెడ్డి మహేష్, పిన్నింటి వెంకట రమణ, డోల ఆనంద్, కోరాడ అప్పలస్వామి నాయుడు పాల్గొన్నారు.

ఆర్డీవోగా వస్తానన్నావు రమణయ్యా..

- అంతలోనే అందని లోకాలకు చేరావా..
- తహసీల్దార్ కుటుంబ సభ్యుల రోదన
- క్రమశిక్షణ గల అధికారిగా గుర్తింపు



తహసీల్దార్ రమణయ్య(ఫైల్)

మధురవాడ/ఆరిలోవ: త్వరలో ఆర్డీవో అవుతానన్నావు.. మరింత మందికి సేవ చేస్తానన్నావు.. పిల్లలను బాగా చదివించాలని ఆశపడ్డావు.. మా అందరికీ పెద్ద దిక్కుగా నిలిచావు.. ఇంతలోనే అందనిలోకాలకు చేరుకున్నావా.. రమణయ్యా అంటూ.. తహసీల్దార్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. సరదాగా, స్నేహభావంతో ఉండేవాడని.. ఇప్పుడు తమకు దూరమయ్యాడంటూ గుండెలవిసేలా రోదించారు. పిల్లలు రమణయ్య ఫొటో చూసి డాడీ.. డాడీ అంటూ ఏడ్చిన తీరు చూపరులను కలచివేసింది. ఆయనతో పనిచేసిన సిబ్బంది అయితే కన్నీరు పెట్టుకున్నారు. రమణయ్య క్రమశిక్షణ గల అధికారిగా మంచి పేరు ఉందని, ఇటీవల గణతంత్ర దినోత్సవం నాడు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారని వారు తెలిపారు.

ఉలిక్కిపడిన కొమ్మాది ప్రాంతం

విశాఖ రూరల్ తహసీల్దార్‌గా పనిచేసిన సనపల రమణయ్య.. తల్లి శకుంతలమ్మ, భార్య అనూష, పాప చాన్విష (7), బాబు రియంత్(3)తో కలిసి కొమ్మాది ప్రాంతంలో చరణ్ కేజిల్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో రెండు రోజుల కిందట ఆయనకు విజయనగరం జిల్లా బొండపల్లికి బదిలీ అయింది. శుక్రవారం ఉదయం అక్కడకు వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. తిరిగి సాయంత్రం కొమ్మాదిలో తన నివాసానికి వచ్చారు. రాత్రి 10 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో రమణయ్యపై ఓ వ్యక్తి ఇనుపరాడ్డుతో దాడి చేశాడు. తలపై 12 సార్లు కొట్టడంతో వెంటనే ఆయన కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అపోలో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. రమణయ్య హత్యతో కొమ్మాది ప్రాంతం ఉలిక్కి పడింది. చాలా ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతంలో ప్రభుత్వ అధికారి హత్య ఉదంతంలో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. కాగా రమణయ్య స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా నంది గామ మండలం దిమిలాడ.



కొమ్మాదిలో చరణ్ కేజిల్ అపార్ట్‌మెంట్

సిబ్బంది దిగ్భ్రాంతి : రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో రెండు రోజుల కిందట వరకు తహసీల్దార్‌గా పనిచేసిన రమణయ్య హత్యకు గురవడం.. సిబ్బందిలో కలవరం రేపింది. శనివారం ఉదయం ఆయన హత్య వార్త విన్న ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు. రమణయ్య 2023 ఫిబ్రవరి 10న కలెక్టరేట్ సి–సెక్షన్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికల విధానంలో భాగంగా ఆయనకు రెండు రోజుల కిందట విజయనగరం జిల్లా బొండపల్లికి బదిలీ జరిగింది. కాగా 15 ఏళ్ల కిందట ఇక్కడ కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేసిన డి.గోపాలరావు మధురవాడ ప్రాంతంలో ఓ స్థలం సర్వేకి వెళ్లి హత్యకు గురయ్యాడు.

బోసిపోయిన తహసీల్దార్ కార్యాలయం

రూరల్ తహసీల్దార్ కార్యాలయం శనివారం బోసిపోయింది. రెండు రోజుల కిందట వరకు ఇక్కడ పని చేసిన తహసీల్దార్ రమణయ్య హత్యకు గురికావడంతో సిబ్బంది విచారవదనంలో మునిగిపోయారు. అధికారి హోదాలో ఉన్నప్పటికీ తమతో సరదాగా, స్నేహభావంతో ఉండేవారని కన్నీరు పెట్టుకున్నారు. సిబ్బందిలో కొందరు కేజీహెచ్ మార్చురీ వద్దకు వెళ్లారు. ఇంకొందరు ఆయన స్వగ్రామానికి మృతదేహంతో పాటు వెళ్లి నివాళులర్పించారు. విషయం తెలుసుకున్న సామాన్యులు సైతం రెవెన్యూ పనుల కోసం కార్యాలయానికి వెళ్లకుండానే వెనుదిరిగారు.

రమణయ్య కుటుంబానికి రూ.లక్ష చెక్కు అందజేత

మహారాణిపేట: కేజీహెచ్ మార్చురీ వద్ద రమణయ్య కుటుంబ సభ్యులను పలువురు ప్రముఖులు పరామర్శించారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ అడిషినల్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు డి.హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి తదితరులు రమణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష రూపాయల చెక్కును రమణయ్య కుటుంబానికి కలెక్టర్ అందజేశారు.

వివరాలు సేకరించిన దిశ ఏసీపీ



తహసీల్దార్ కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్న దిశ ఏసీపీ వివేకానంద్

రమణయ్య హత్య నేపథ్యంలో రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో పోలీసులు దర్యాప్తు చేశారు. దిశ ఏసీపీ సీహెచ్ వివేకానంద్ శనివారం కార్యాలయాన్ని సందర్శించి డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, ఇతర సిబ్బందిని విచారించారు. ప్రతి రోజూ ఇక్కడ జరుగుతున్న విధివిధానాలు, ఎవరు తరచూ కార్యాలయానికి ఏ ఏ పనులపై వచ్చి వెళ్తుండేవారు.. ఇటీవల ఎవరు ఎక్కువసార్లు వచ్చేవారు.. ప్రతి రోజూ ఏ సమయంలో విధుల్లో ఎవరెవరు ఉండేవారు తదితర విషయాలపై ఆరా తీశారు.

దివ్యాంగులకు ఐవోసీఎల్ అండ

- రూ.33 లక్షల విలువైన ఉపకరణాల వితరణ
- అందజేసిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి, కలెక్టర్ మల్లికార్జున



దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి, కలెక్టర్ మల్లికార్జున

మధురవాడ, పీఎంపాలెం: దివ్యాంగులకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీఎల్) అండగా నిలిచి, వారికి అవసరమైన ఉపకరణాలు అందజేయడం అభినందనీయమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. చంద్రంపాలెం హైస్కూల్‌లో శనివారం ఐవోసీఎల్ ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాల తయారీ సంస్థ అలిమ్‌కో వివిధ అవయవ లోపాలు ఉన్న వారికి ఉపకరణాల పంపిణీ చేపట్టింది. గాజువాక, ఆనందపురం మండలాల పరిధిలో 284 మంది లబ్ధిదారులను ఇది వరకే గుర్తించగా.. వారికి అవసరమైన ఉపకరణాల కోసం ఐవోసీఎల్ రూ.33 లక్షలను సమకూర్చింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముత్తంశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులను అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు. నెలా నెలా పింఛన్ అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేసే అన్ని పథకాల్లో దివ్యాంగులకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. దివ్యాంగులందరికీ ఉపకరణాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఐవోసీఎల్ జీఎం జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఏడాదికి సుమారు రూ.10 కోట్లతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ మల్లికార్జున సూచనలతో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే చేతులమీదుగా దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు, చేతికర్రలు, వినికిడి యంత్రాలు తదితర పరికరాలను అందజేశారు. విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, స్థానిక నాయకులు పోతిన శ్రీనివాసరావు, బొట్ట అప్పలరాజు, వంకాయల మారుతీ ప్రసాద్, పోతిన యల్లాజీ, కృష్ణ మూర్తి పాత్రుడు, కుడితి రామారావు, సూరిబాబు, జామి శివ కుమార్, ఐవోసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో ‘స్వర్ణభారతి’ ఆధునికీకరణ



సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

సీతంపేట: స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంను అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ ఎరీనాగా అభివృద్ధి చేసి.. ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న స్టేడియం అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. టెన్నిస్ కోర్టును పూర్తిగా ఆధునికీకరించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. రానున్న రోజుల్లో నగరంలో జరిగే అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు అణుగుణంగా అన్ని సదుపాయాలతో స్టేడియంను అభివృద్ధి చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్‌ను కమిషనర్ ఆదేశించారు. పచ్చదనం, వీక్షకుల గ్యాలరీ, లైటింగ్, ఫ్లోరింగ్, ఏసీ, టాయిలెట్స్, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఏసీపీ రఘునాథ్, స్పోర్ట్స్ డైరెక్టర్ హనుమంతరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

దోషులను ఉరితీయాలి

- ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా న్యాయం చేయాలి
- తహసీల్దార్ కుటుంబాన్ని ఆదుకోవాలి
- రెవెన్యూ సంఘాల నాయకుల డిమాండ్



సీపీకి వినతి పత్రం సమర్పిస్తున్న రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు



జేసీ మయూర్ అశోక్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న రెవెన్యూ సంఘాల నాయకులు

మహారాణిపేట: తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేసి దోషులకు ఉరిశిక్ష విధించాలని ఏపీ జేఏసీ(అమరావతి) విశాఖ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్, వీఆర్వో అసోసియేషన్‌లు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశాయి. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, పోలీసు కమిషనర్ రవిశంకర్‌కు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన చేసి దోషులపై తక్షణం చర్యలు తీసుకుని ఆ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. కేజీహెచ్ మార్చురీ వద్ద రమణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ(అమరావతి) జిల్లా అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ తహసీల్దార్ రమణయ్య హత్య కేసుల్లో దోషులను తక్షణం శిక్షించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రతి మండల కార్యాలయాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ.త్రినాథరావు మాట్లాడుతూ విశాఖ రూరల్ మండలంలో కోర్టు కేసులు చాలా పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే మండల పరిధి ఎక్కువగా ఉన్నందున అందుకు తగ్గ సిబ్బందిని నియమించాలని కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వి.రమేష్ మాట్లాడుతూ తహసీల్దార్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బెహరా రవిశంకర్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట అప్పారావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దేవరాజు, రెవెన్యూ సంఘం నాయకులు పి.శ్యామ్, పి.కృష్ణమూర్తి, రమామణి, తాడ్డి గోవింద తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో విశాఖ మహా నగరం

- మేయర్ గొలగాని హరివెంకట కుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- 50వ వార్డులో యూపీహెచ్‌సీ, కమ్యూనిటీ హాల్, రోడ్లు ప్రారంభం
- రూ.1.94 కోట్ల నిధులతో నిర్మాణం



మురళీనగర్‌లో యూపీహెచ్‌సీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, చిత్రంలో కార్పొరేటర్లు

మర్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్‌లో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ), వంశీనగర్‌లో సామాజిక భవనాల ప్రారంభోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ రూ.47.50 లక్షలతో ఆరోగ్య కేంద్రం, రూ.49.90 లక్షలతో సామాజిక భవనం నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వార్డులో మరో రూ.97 లక్షలతో సీసీ, బీటీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు నిర్మించామని, మొత్తంగా రూ.1.94 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. నగరంలో ఎటు చూసినా అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. కొండవాలు ప్రాంతాలను ఎన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని గర్వంగా చెబుతున్నామని ఆమె పేర్కొన్నారు.

ప్రజలకు మెరుగైన వసతులు : సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఎలాగైతే సంక్షేమ పథకాలు అందిస్తున్నారో.. అదే విధంగా విశాఖను ఒక అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఏ నాయకుడు చేయని అభివృద్ధిని ఆయన చేసి చూపించారని తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు చల్లా రజని, కంటిపాము కామేశ్వరి, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, కె.అనిల్‌కుమార్‌రాజు, కె.వి.ఎన్.శశికళ, కోఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, ఈతమచ్చిరాజు, ఏతు సతీష్, పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు, జేసీఎస్ మండల కన్వీనర్ నీలి రవి, 50వ వార్డు నాయకులు సునీత, విజయ్, ఎం. లక్ష్మి, శ్రీనివాసరాజు, రాజారాజు, విశ్వనాథరాజు, రఘు, నారాయణస్వామి, ఎ.వి.ఎన్.రాజు పాల్గొన్నారు.





ఉత్సాహంలో విద్యార్థులు







భారత్ జోరు.. విశాఖ హుషారు



విశాఖ స్పోర్ట్స్: పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో రెండో రోజూ భారత్ జోరును కొనసాగించింది. దీంతో క్రికెట్ అభిమానుల్లో హుషారు రెట్టింపైంది. రెండో టెస్ట్ మ్యాచ్‌లో భాగంగా తొలి రోజు ఆట యశస్వి వర్సెస్ ఇంగ్లండ్ కాగా, రెండో రోజు బుమ్రా వర్సెస్ ఇంగ్లండ్‌గా సాగడంతో అభిమానులు ఆటను పూర్తిగా ఆస్వాదించారు. యశస్వి డబుల్ సెంచరీని ప్రత్యక్షంగా తిలకించేందుకు శనివారం ఉదయాన్నే స్టేడియం వద్దకు చేరుకుని సందడి చేశారు. సౌత్, నార్త్ లోయర్ టైర్స్‌లో అభిమానుల హర్షాతిరేకాలతో స్టేడియం హోరెత్తింది. యశస్వి 191 పరుగుల వద్ద ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా వరుస బంతుల్లో ఫోర్, సిక్సర్‌తో డబుల్ సెంచరీ చేసినప్పుడు ఒకటే కోలాహలం నెలకొంది. మ్యాచ్‌ను చూసేందుకు మూడు వేల మందికి పైగా విద్యార్థులు తరలిరాగా.. వారందరినీ రెండు గేట్ల ద్వారా లోపలకు అనుమతించారు. ఆదివారం ఆట ప్రారంభానికి ముందు వచ్చిన విద్యార్థులనే అనుమతిస్తామని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న శుభ్‌మన్ గిల్ రెండో రోజు ఆట ముగిసిన తర్వాత ఒక్కడే ఔత్సాహిక క్రికెటర్లతో కలిసి స్టేడియంలో ప్రాక్టీస్ చేశాడు. మూడో రోజు ఆటలో కీలకంగా మారి విశాఖ వేదికగానే ఫామ్‌లోకి రావడానికి సమాయత్తమయ్యాడు.





'డబుల్' ఆనందం



మ్యాచ్‌ను తిలకిస్తున్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి











యువతుల కేరింతలతో హోరెత్తిన స్టేడియం